క్లుప్తంగా

నేడు పింఛన్లు పంపిణీ

పొన్నలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో శనివారం ఉదయం 10 గంటలకు కొత్త పింఛన్లతో పాటు పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ కల్పన ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్‌ను అందజేస్తారని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

నేడు మర్రిపూడిలో..

మర్రిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీడీఓ ఎస్.సుదీపా తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పింఛనుదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై బసవరాజు

మర్రిపూడి: మండలంలోని కాకర్ల గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బసవరాజు తెలిపారు. మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన వెంకట్రావు ఇంట్లో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై తమ సిబ్బందితో దాడి చేసి 28 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలో శనివారం నుంచి 12వ తేదీ వరకు ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్‌కు సంబంధించి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం వెన్నూరు, మధ్యాహ్నం ఇలవర, నెన్నూరుపాడు, 7వ తేదీ ఉదయం చిన్నకండ్లగుంట, మధ్యాహ్నం పెట్లూరు, 8వ తేదీ మధ్యాహ్నం చిన్నవెంకన్నపాలెం, 9వ తేదీ ఉదయం కొండపి, అనకర్లపూడి, మధ్యాహ్నం చోడవరం, 10వ తేదీ మధ్యాహ్నం మూగచింతల, కె.ఉప్పలపాడు, 12వ తేదీ ఉదయం ముప్పవరం, పెద్దకండ్లగుంట, ముప్పరాజుపాలెం, గుర్రప్పడియ, ముప్పరాజుపాలెం, మధ్యాహ్నం కట్టుబడిపాలెం, గోగినేనివారిపాలెం, పెరిదేపి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉపాధి హామీ కూలీలు గ్రామసభలకు హాజరై సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు.

7న తైక్వాండో సబ్ జూనియర్ ఎంపికలు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో సబ్ జూనియర్ బాల, బాలికల పోటీలు ఈ నెల 7వ తేదీన మార్కాపురంలోని రాక్వెల్ పబ్లిక్ స్కూల్ ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు తైక్వాండో జిల్లా కార్యదర్శి, మాస్టర్ ఎస్‌కే అబ్దుల్ సలాం తెలిపారు. సబ్ జూనియర్ జిల్లా స్థాయి ఎంపికల పోటీల్లో క్రీడాకారులంతా పాల్గొనాలన్నారు. ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20, 21వ తేదీల్లో నంద్యాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 8686240540 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మిట్టపాలెంలో స్వచ్ఛభారత్



మిట్టపాలెంలో స్వచ్ఛభారత్‌లో కేజీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

సీఎస్‌పురం(పామూరు): జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని మిట్టపాలెంలో శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రెండో రోజు కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, ఉద్యానవన కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో నారాయణస్వామి ఆలయం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యార్థులు నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

అవ్వాతాతలకు పెన్షన్ కానుక ఓ వరం

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



పామూరులో పెన్షన్ నగదు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

పామూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక అవ్వా తాతలకు ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక ఒకటో సచివాలయం ఆవరణలో శుక్రవారం ఎంపీపీ గంగసాని లక్ష్మి, సర్పంచ్ అల్లూరి రాగమ్మల అధ్యక్షతన పెంచిన రూ.3 వేల వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నెలకు రూ.400 కోట్ల పెన్షన్లు ఇస్తే ప్రస్తుతం రూ.1950 కోట్లు అందజేస్తున్నామన్నారు. నవరత్నాల పథకాల్లో 95 శాతానికి పైగా హామీలు అమలు చేశారని కొనియాడారు. అర్హులందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల కళ్లలో సంతోషం నింపుతున్నారన్నారు. టీడీపీకి ఇవే చివరి ఎన్నికలని, రానున్న ఎన్నికల్లో టీడీపీని ప్రజలు బంగాళాఖాతంలో కలపడం తథ్యమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంగా జగన్‌ను మరోసారి చేసేందుకు అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, సర్పంచ్ అల్లూరి రాగమ్మ, ఉపసర్పంచ్, యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, వి.బ్రహ్మానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బాషా, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, గంటా రమణయ్య, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం ఇన్‌చార్జి తాటిపర్తికి సన్మానం



తాటిపర్తిని సన్మానిస్తున్న సింగరాయకొండ మండల నాయకులు, కార్యకర్తలు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జిగా నియమితులైన తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఇన్‌చార్జిగా నియమితులైన తర్వాత శుక్రవారం స్వగ్రామం సింగరాయకొండ వచ్చిన తాటిపర్తిని నియోజకవర్గ పార్టీ శ్రేణులతోపాటు యర్రగొండపాలెం నియోజకవర్గ నేతలు గజమాలతో సత్కరించారు. ఈద్గామిట్ట దర్గాలో తాటిపర్తి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం, వైఎస్సార్ సీపీ బలోపేతానికి చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి యర్రగొండపాలెం ఇన్‌చార్జిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. తనపై సీఎం వైఎస్ జగన్ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, యర్రగొండపాలెం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పుల్లలచెరువు జెడ్పీటీసీ సభ్యుడు వాక్యానాయక్, శుద్ధకురవ తండా సర్పంచ్ వెంకటేశ్వర్లు నాయక్, పెద్ద పీఆర్సీ తండా సర్పంచ్ బద్దు నాయక్, నెరజాముల తండా సర్పంచ్ పెద్దబాలునాయక్, పాలుట్ల తండా సర్పంచ్ సురేష్ నాయక్, పార్టీ జిల్లా ఎడ్యుకేషనల్ వింగ్ నేత లక్ష్మానాయక్, నారాయణరెడ్డి, నాగేశ్వరరావు నాయక్, సింగరాయకొండ మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు షేక్ లియాఖత్, జిల్లా మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నౌషాద్, షేక్ పటేల్, యన్నాబత్తిన కార్తీక్, షేక్ సలీంబాషా, జెట్టి శంకరరెడ్డి, జాన్‌కిషోర్, సవలం కోటేశ్వరరావు, గొడసేరు అనిల్, సోమిశెట్టి సురేష్, రావినూతల అంకయ్య, ముదిరెడ్డి భాగ్యమ్మ, మిట్టపాలెం, వేంపాడు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరాలు పేదలకు వరం



నర్సింగోలులో మాట్లాడుతున్న వైద్యాధికారి లీనా రాఫెల్



పీఎంజేఏవై కార్డులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన

జరుగుమల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల పాలిట వరమని వైద్యాధికారి డాక్టర్ లీనా రాఫెల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నర్సింగోలు సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును ఎంపీడీఓ కె.జలజాక్షి పరిశీలించారు. 245 మంది రోగులను వైద్యులు పరీక్షించగా.. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను స్థానిక సర్పంచి ఏజెర్ల ఇక్కయ్యతో ఎంపీడీఓ పంపిణీ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ పాటిబండ్ల భవాని, ఈఓపీఆర్డీ ఎం.అంజలీదేవి, నాయకులు పాటిబండ్ల నాగేశ్వరరావు, నలమోతు కృష్ణమోహన్, చెన్నారెడ్డి మాలకొండయ్య, చెన్నారెడ్డి మధుబాబు, సచివాలయ కార్యదర్శులు జె.రవికుమార్, ఎం.గణేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు

పొన్నలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, ఎంపీడీఓ కల్పన, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ అసుపత్రులకు దీటుగా వైద్య సేవలు

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఫేజ్- 2 నిర్వహించినట్లు ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యాక్రమం అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు, అమ్మపాలెం గ్రామ సర్పంచ్ ఓబులు కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ ఇంటూరి భారతి మాట్లాడుతూ కార్పొరేట్ అసుపత్రులకు దీటుగా ప్రభుత్వ అసుపత్రిల్లో వైద్య సేవలు ఉచితంగా ప్రజలకు అందేలా చూడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముగ్గురిని పెద్ద అసుపత్రులకు రిఫరల్ చేసినట్లు డాక్టర్ మణిదీపిక అన్నారు. ఎంపీడీఓ రఫీక్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్ శిద్ధ శివప్ప, స్పెషలిస్ట్ వైద్యులు వరుణ్ తేజ, పేరయ్య, కృష్ణారెడ్డి, సీహెచ్‌ఓ, సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వెలిగండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప వరమని గుడిపాటిపల్లి సర్పంచ్ కటికల రిబ్కా వెంకటరత్నం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం మండలంలోని గుడిపాటిపల్లి పంచాయతీలో నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్లు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. వెలిగండ్ల సింగిల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, డాక్టర్ మౌనిక, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యసాధన సాకారమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.సృజన, బొట్లగూడూరు పీహెచ్‌సీ డాక్టర్ దాసరి హరిబాబు అన్నారు. మండలంలోని నుచ్చుపొద సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ ప్రవీణలు 408 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.సృజన తనిఖీ చేసి వైద్యశిబిరం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ మద్దెల సుప్రజ, హెచ్‌ఈఓ నల్లబోతుల బ్రహ్మానందం, సుభాషిణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ముద్దపాడులో నిర్వహించిన జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని సర్పంచ్ మూలె అరుణ కుమారి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఎంపీటీసీ కొండారెడ్డి , వైద్యసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



వలేటివారిపాలెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ భారతి



మాలపాడులో మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పొగాకు సాగులో డ్రిప్ ఇరిగేషన్‌తో మేలు



కొండపి మండలం పెద్దకళ్లగుంటలో పొగతోటలను పరిశీలిస్తున్న ఐటీసీ కంపెనీ ప్రతినిధులు

కొండపి(సింగరాయకొండ): పొగాకు సాగులో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ఎంతో ఉపయోగకరమని ఐటీసీ కంపెనీ ప్రతినిధులు రైతులకు సూచించారు. కొండపి మండలంలోని పెద్ద కళ్లగుంట గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం పొగాకు పంటలో ఆధునిక డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు ఎల్‌ఎమ్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ.. వాతావరణం బెట్టగా ఉన్నప్పుడు ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. పొలంలో ఆకు రెలిచేటప్పుడు మొక్క కింద భాగంలో కలుపు, పిచ్చిమొక్కలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పొగాకు నిల్వ ఉంచే షెడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన పొగాకు బేళ్లు కట్టేటప్పుడు కాగితాలు ఉపయోగించరాదని వివరించారు. పొగాకు బ్యారన్లు ఉన్న వారు మాత్రమే పొగాకు సాగు చేయాలని, మిగిలిన వారు మిరప, కంది లాంటి వాణిజ్య పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పొగ తోటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. బోర్డు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.సాయికుమార్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలు ప్రోత్సహించడమే లక్ష్యం



క్రీడాకారులతో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

కనిగిరి రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా కనిగిరి జూనియర్స్ బాలుర కాలేజీ యువకుల ఖోఖో పోటీలను శుక్రవారం పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడా కారుల్లోని నైపుణ్యతను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు ఎంతో దోహద పడుతున్నాయన్నారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మండాది కృష్ణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మిట్టా రమేష్‌రెడ్డి, ఎంఈఓ రామిరెడ్డి, హెచ్‌ఎం కోటిరెడ్డి, ఖోఖో టీం కోచ్ కాశీ విశ్వనాథరెడ్డి, పీడీలు జ్యోతి బాబు, హజరత్‌రెడ్డి, బత్తుల సుశీల, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం ఆడుదాం ఆంధ్ర క్రీడలను కళాశాలలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంతో క్రీడల్లో పాల్గొని క్రీడా ప్రతిభను చాటాలన్నారు. వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్ దాసరి మురళీ, పార్టీ నాయకులు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉపాధి టీఏ వెంకటేశ్వర్లుకు సన్మానం



టీఏని సన్మానిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: ఉపాధి హామీ పథకంలో టీఏగా ఉద్యోగ విరమణ చేసిన జీ.వెంకటేశ్వర్లు దంపతులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, ఎంపీడీఓ కె.లలిత తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లు సేవలను కొనియాడారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మండల సర్పంచ్ సంఘాల అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ కత్తి రాజారావు, ఏఓ జీవీ క్రిష్ణారావు, ఏపీఓలు, ఈసీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కనిగిరి రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉండటంతో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతి, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, రోడ్లు చిమ్మి, చెత్త చెదారాన్ని ఎత్తి మున్సిపల్ ట్రాక్టర్లో వేసి ప్రజలను పరిశుభ్రతపై చైతన్యం చేశారు. చెత్త రోడ్లపై వేస్తే జరిమానా ఉంటుందని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, కో ఆప్షన్ సభ్యులు చింతం శ్రీను, మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు చంద్రశేఖర్, సోమిశెట్టి శ్రీనివాసులు, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

కందుకూరు: ఆర్టీసీ పల్లె వెలుగు సర్వీసులను ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న ప్రత్యేక బహుమతి పథకం కింద లక్కీడ్రాలో ఎంపికైన వారికి బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి శుక్రవారం తెలిపారు. ఇసుకపాలెం, మొగిలిచర్ల, కొండాపురం, కలిగిరి రూట్‌లల్లో ప్రయాణించిన కె. భాను, కొండారెడ్డి, షఫీ విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. ఆర్టీసీ వైపు ప్రయాణికులను ఆకర్షించేందుకు ఈ గిఫ్ట్ స్కీం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సురక్షితంగా ప్రయాణించడంతో పాటు, బహుమతులు గెలుచుకోవచ్చునని సూచించారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముసిపై బ్రిడ్జి నిర్మాణ ఏర్పాట్ల పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఈ మాలకొండయ్య

టంగుటూరు: మండలంలోని అనంతవరం–తేటుపురం గ్రామాల మధ్య ముసి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లను పీఐయూ ఏఈ మాలకొండయ్య శుక్రవారం పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఏఈ పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో అనంతవరం సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కనిగిరి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల పాలిట వరమని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. మండలంలోని ఎస్ గొల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షా రెండో విడత వైద్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సంరక్షణ కల్పించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ ఆరోగ్య సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, నాయకులు శ్రీహరిరెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, మిట్టా రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్ గొల్లపల్లి సచివాలయం పరిధిలో పెన్షన్ కానుక నూతన పింఛన్లు, పెంపుదల పింఛన్లను జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ పంపిణీ చేశారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ


బ్రహ్మాస్త్రంతో లద్దె పురుగు నివారణ



బ్రహ్మాస్త్రం కషాయం తయారు చేస్తున్న విజయలక్ష్మి

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి తుమ్మలపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో రైతుల శనగ, మినుము, ఇతర పంటల్లో పచ్చ పురుగు, లద్దె పురుగు నివారణకు బ్రహ్మస్త్రం కషాయం తయారు చేశారు. కషాయం ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయనాల వాడకం ఆపేయాలని సూచించారు. గ్రామంలో గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మరింత మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు వెంకట్రావు, ఐసీఆర్పీలు శృతి, హరిత, జోత్స్న, మరియమ్మ, సుజాత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ



లబ్ధిదారులకు గ్యాస్‌కనెక్షన్లు పంపిణీచేస్తున్న ఎంపీడీఓ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన వంట గ్యాస్ కనెక్షన్‌లను మహిళలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి, పుల్లగూరపల్లి పంచాయతీల్లో సర్పంచ్‌లు సీహెచ్.రాధాకృష్ణారెడ్డి, యం.భానుతేజల అధ్యక్షతన శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ పరికరాల ప్రాధాన్యత, వినియోగించే విధానంపై రైతులకు నమూనా ద్వారా వివరించారు. ఈఓపీఆర్‌డీ కె.సుందరరామయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి రమణయ్య, ఇండ్ల వెంకట సత్యం, జాజం చిన్న సుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోండి



కొండారెడ్డిపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సందీప్ అన్నారు. శుక్రవారం కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికి ఫ్యామిలీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధిలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలిచ్చారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య క్యాంపులో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశాలు, పాల్గొన్నారు.